ప్రజాశక్తి

బుధవారం 27 డిసెంబర్ 2023 5

శ్రీ సత్యసాయి

ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఇంటి వద్ద నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

'ఎమ్మెల్యే సార్.. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లండి..!

◆ శ్రీధర్‌రెడ్డి నివాసాన్ని ముట్టడించిన ఎస్ఎస్ఎ ఉద్యోగులు
◆ 7వ రోజు కొనసాగిన సమ్మె ◆ మానహారం, భిక్షాటనతో నిరసన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

సమగ్రశిక్షా 7వ రోజు సమ్మె

ఎన్నికల హామీలను అమలు చేసి తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించేలా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డితో మాట్లాడి మాకు న్యాయం చేయండి'.. అంటూ ఎస్ఎస్ఎ ఉద్యోగులు పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని కోరారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమగ్రశిక్షా ఉద్యోగులు పుట్టపర్తిలో చేపట్టిన సమ్మె మంగళవారం 7వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి కార్యాలయాన్ని ముట్టడించారు. తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించాలని కోరుతూ నిరసన తెలిపారు. ముందుగా గణేష్ కూడలిలో మానవహారం ఏర్పాటుచేశారు. అక్కడి నుంచి ఎమ్మెల్యే కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి బైటాయించారు. దాదాపు గంటపాటు ఎమ్మెల్యే కార్యాలయం ముందు కూర్చొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఒక సమయంలో ఎమ్మెల్యే కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించగా అక్కడున్న పోలీసులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఎస్ఎస్ఎ ఉద్యోగుల వద్దకొచ్చి వారితో మాట్లాడారు. సమస్యలను విద్యా శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి ఆయనద్వారా సీఎంవో కార్యాలయానికి పంపుతామని హామీ ఇచ్చారు. దీంతో ఉద్యోగులు ఎమ్మెల్యేకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. అక్కడి నుంచి సమగ్ర శిక్షా ఉద్యోగులు గణేష్ కూడలి, యనమలపల్లి సంత మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు భిక్షాటన చేశారు. ఆర్డీవో కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలియజేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు మరింత ఉధృతం అవుతాయని హెచ్చరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్ మాట్లాడుతూ సమగ్రశిక్షా ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలన్నారు. ఉద్యోగ విరమణ వయసు62 సంవత్సరాలకు పెంచాలన్నారు. మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ సెలవులు వర్తింపజేయాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవచూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు ఓబుల్ రెడ్డి జనరల్ సెక్రెటరీ రామన్న, వెంకటరమణ, బాలాజీ, మహేంద్ర, శ్రీనివాసులు, శంకరయ్య, కిష్టప్ప, ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిలర్ కోనంకి చంద్రశేఖర్, ఆదినారాయణ, ఆసిఫ్, తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసనాగ్రహం

పుట్టపర్తి నగర పంచాయతీ కార్యాలయం వద్ద సమ్మెలో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు

సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ కార్మికులు సమ్మెబాట పట్టారు. వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపల్ కార్యాలయాల పరిధిలో విధులను బహిష్కరించి నిరసనలు తెలిపారు. జిల్లా పరిధిలోని పుట్టపర్తి, ధర్మవరం, కదిరి, మడకశిర, హిందూపురం మున్సిపల్ కార్యాలయాల వద్ద కార్మికులు ఆందోళనలు నిర్వహించారు. ఐదేళ్లు గడుస్తున్నా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం దుర్మార్గంగా ఉందని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

వార్త 6లో

అంగన్‌వాడీల నిరసన 'మోత'

ధర్మవరంలో ప్లేట్లు మోగించి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె కొనసాగుతోంది. మంగళవారం నాడు జిల్లాలోని అన్ని మండలాల్లో నిరసన 'మోత'మోగించారు. దీక్షా శిబిరాల వద్ద ప్లేట్లను మోగిస్తూ నిరసన తెలిపారు. ప్రభుత్వం, ముఖ్యమంత్రి ముద్దునిద్ర వీడాలంటూ నినాదాలు చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ నిరసన కార్యక్రమాలు కొనసాగాయి. మడకశిర, ధర్మవరం, పెనుకొండ, కదిరి, గోరంట్ల, సోమందేపల్లి, ముదిగుబ్బ తదితర ప్రాంతాల్లో ప్లేట్లు మోగిస్తూ నిరసన తెలిపారు. మిగిలిన ప్రాంతాల్లోనూ అంగన్‌వాడీలు నిరసన కార్యక్రమాలను కొనసాగించారు.

వార్త 6లో

జగన్‌పై వాలంటీర్ల తిరుగుబాటు

హిందూపురం మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వాలంటీర్లు

◆ హిందూపురం మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన
◆ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం బహిష్కరణ
◆ సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె తప్పదు

ప్రజాశక్తి-హిందూపురం

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి సొంత సైన్యంగా చెప్పుకునే వార్డు వాలంటీర్లు ఒక్కసారిగా ఆయనపై తిరుగుబాటు చేశారు. సమస్యలను పరిష్కరించాలని, తమను పొరుగు సేవల ఉద్యోగులుగా గుర్తించి, రూ 18 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళన బాట పట్టారు. శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలో పట్టణంలో మంగళవారం ఉదయం వాలంటీర్లు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని బహిష్కరించారు. పట్టణంలోని ఎంజీఎం మైదానం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ ఛాంబర్ ముందు బైఠాయించారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు వాలంటీర్లు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల నుంచి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు చేర్చడంలో తాము కీలకపాత్ర పోషిస్తున్నామన్నారు. కరోనా విపత్కర సమయంలో సైతం తాము ప్రాణాలను ఫణంగా పెట్టి ముందుండి ప్రజలకు సేవలు అందించామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అన్ని సంక్షేమ పథకాలను అర్హులకు అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నామని చెప్పారు. ఇన్ని సేవలు చేస్తున్న తమను ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరం అన్నారు. తమ సర్వీసును క్రమబద్ధీకరణ చేయాలన్నారు. పొరుగు సేవల ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది మాదిరి వాలంటీర్లను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలన్నారు. తమ డిమాండ్ల సాధన కోసం నిరవధిక ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. అనంతరం హిందూపురం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పట్టణానికి చెందిన వాలంటీర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైసిపి నాయకులు బెదిరింపులు... వెనక్కి తగ్గని వాలంటీర్లు...

హిందూపురం మున్సిపల్ కార్యాలయం వద్ద వాలంటీర్లు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న వైసిపి నాయకులు, కౌన్సిలర్లు వారిపై బెదిరింపులకు దిగారు. ఆందోళనలో పాల్గొన్న వారికి నాయకులు స్వయంగా ఫోన్ చేసి అక్కడి నుంచి వెనక్కు రావాలని ఆదేశించారు. వాలంటీర్లు అధికార పార్టీ నేతల ఒత్తిడికి భయపడకుండా ఆందోళనను కొనసాగించారు.

మహిళా కార్మికుల హక్కుల కోసం పోరాటం

వ్యవసాయ మహిళా కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాణి

ప్రజాశక్తి -పెనుకొండ

వ్యవసాయ రంగ మహిళా కార్మికులు సంఘటితమై తమ హక్కుల సాధనకోసం పోరాటాలు సాగించాలని వ్యవసాయ మహిళా కార్మికసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాణి పిలుపునిచ్చారు. పట్టణంలో వ్యవసాయ మహిళా కార్మికులతో జిల్లా సదస్సు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి నాగరాణితో పాటు శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ దిల్షాద్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ వ్యవ సాయ జీవన విధానాలు చాలా దుర్భరంగా ఉన్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చేయడానికి పనులు లేక వలసలు వెళ్లి అనేక అవమానాలు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. కుటుంబాలలో ఎదురవుతున్న ఇబ్బందులను తట్టుకునే నిలబడుతున్నది మహిళలేనని గుర్తు చేశారు. ఉపాధి హామీ పని ద్వారా కొద్దిపాటి పనులు కల్పించినా చేసిన పనులకు బిల్లులు చెల్లించక ప్రభుత్వాలు అలసత్వం వహిస్తున్నాయని విమర్శించారు. పనికి తగ్గ వేతనాలు ప్రభుత్వాలు చెల్లించడం లేదని బాధపడ్డారు. మహిళా కార్మికులు సంఘటితమై ఉపాధి రక్షణ కూలీ పెంపు కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ దిల్షాద్ మాట్లాడుతూ సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నప్పటికీ వేతనాల పొందడంలో వ్యత్యాసాలు ఉన్నాయన్నారు. పని ప్రదేశాల్లో ఇప్పటికీ

సదస్సులో పాల్గొన్ననాయకులు

వివక్షకు గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న మహిళలు పని భద్రత వేతనాల పెంపు కోసం పోరాటాలు నిర్వహిస్తున్నారని అన్నారు. వ్యవసాయ మహిళా కార్మికులు కూడా ఉపాధి రక్షణ పని దినాల పెంపు కూలి వేతనాల పెంపు కోసం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జనవరి నెలలో ఇళ్ల స్థలాలు , భూముల సాధన కోసం పుట్టపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరగబోయే నిరసన దీక్షలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా వ్యవసాయ మహిళా కార్మిక సంఘం జిల్లా కమిటీని 24 మందితో ఎంపిక చేశారు. జిల్లా కన్వీనర్ గా వర్షిని జిల్లా కోకన్వీనర్ గా అనిత, అశ్వినితో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం ర్యాలీగా సబ్ కలెక్టర్ కార్యాలయం చేరుకొని తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సబ్ కలెక్టర్‌కు సమర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, ఐద్వా మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌతమి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు వెంకట్రాముడు,నారాయణ,కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు హనుమయ్య, రమణ, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశులు,సిఐటియు మండల నాయకులు కొండా వెంకటేశులు, స్థానిక సిపిఎం నాయకులు తిప్పన్న, భూ పోరాట కేంద్రాల నుండి దివ్యభారతి, మనీ,వెంకట్, లక్ష్మమ్మ,అలివేలమ్మ మహిళలు పాల్గొన్నారు.

అధికారుల డుమ్మా...

ప్రజాశక్తి:- చిలమత్తూరు

చిలమత్తూరు మండలం గాడ్రళ్ల పల్లిలో చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు డుమ్మా కొట్టారు. గాడ్రల్లపల్లిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వైసిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి దీపిక పాల్గొన్నారు. పలువురు త్రాగునీటి సమస్యపై ఫిర్యాదు చేయగా అందుకు సంబందించిన ఆర్డబ్ల్యూ ఎస్ అధికారి అందుబాటులో లేరు. ప్రభుత్వం ఒక వైపు అన్ని శాఖల అధికారులు గడపగడపకు కార్యక్రమంలో పాల్గొనాలని సూచించినప్పటికి కొన్ని శాఖల అధికారులు మాత్రం డుమ్మా కొడుతున్నారు. దీంతో సంబందం లేని శాఖలు వారి సమస్యలను నోట్ చేసుకుంటున్నారే తప్ప పరిష్కారం కావటం లేదు. ఇలాంటప్పుడు ఈ కార్యక్రమం చేపట్టడం ఎందుకని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.ఈకార్యక్రమం లో ఎంపిపి పురుషోత్తమ రెడ్డి, ఎంపిడిఓ నరేష్‌క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణుల సత్తా చూపిస్తాం

ధర్మవరం టౌన్ : సార్వత్రిక ఎన్నికలలో వైసీపీ ప్రభుత్వానికి నాయి బ్రాహ్మణుల సత్తాచూపిస్తామని నాయిబ్రాహ్మణసాధికార రాష్ట్ర కమిటిసభ్యులు ఆనంద్ హెచ్చరించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం టీడీపీ నాయి బ్రాహ్మణనసాధికార సమావేశం, బీసీ భరోసా బాట కార్యక్రమాన్ని నాయిబ్రాహ్మణ సాధికార రాష్ట్ర కమిటీ సభ్యులు ఆత్మకూరు ఆనంద్, జిల్లా అధ్యక్షులు రామాంజినేయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ నియోజకవర్గ సభ్యులు లక్ష్మీనారాయణ, రామచంద్ర, రాప్తాడు రామకృష్ణ, పెనుకొండ త్యాగరాజు, హిందూపురం రమేష్‌బాబు, కదిరి వేముల రామకృష్ణ, అనంతపురం సురేంద్ర, స్థానిక నాయకులు చలపతి, దామోదర, తిరుపతయ్య, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు

సమావేశంలో మాట్లాడుతున్న పట్టు రైతు సంఘం నాయకులు

పట్టు రైతులకు ఇన్సెంటీవ్ విడుదల చేయాలి

రైతు సంఘం జిల్లా కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్ర వ్యాప్తంగా పట్టు రైతులకు ఇవ్వాల్సిన ఇన్సెంటీవ్‌ను వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని లేని పక్షంలో ఈ నెల 28 నుంచి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని పట్టుగూళ్ల మార్కెట్‌లో పట్టు రైతులతో సమావేశం నిర్వహించారు. రైతు సంఘం నాయకులు సిద్దారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సుబ్బిరెడ్డితో పాటు పట్టు రైతు సంఘం రాష్ట్ర నాయకులు ధనపూరం వెంకట్రామిరెడ్డి మాట్లాడుతు పట్టు రైతులకు ఇవ్వాల్సిన ప్రోత్సహకాలను వెంటనే ఇవ్వాలన్నారు. ఇన్సెంటీవ్ విడుదల చేయాలని కోరుతు పట్టు రైతు సంఘం ఆద్వర్యంలో నాయకులు, రైతులు ఇప్పటికి 12 సార్లు విజయవాడకు వెళ్లి మంత్రులతో పాటు ప్రభుత్వ సలహదారులను, అధికారులను కలిసి సమస్యలను వివరించామన్నారు. అయినప్పటికి ఇప్పటి వరకు స్పందన లేదన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 28న అన్ని మండల కేంద్రాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. అప్పటికి విడుదల చేయక పోతే జనవరి 2న ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట, 8న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. అప్పటికి ప్రభుత్వం స్పందించక పోతే కార్యచరణను రూపొందించి రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఈ సమావేశంలో నాయకులు సోమశేఖర్, జయరామిరెడ్డి, ఆదినారాయణ, సోమశేఖర్‌తో పాటు పట్టు రైతులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం

పుట్టపర్తి రూరల్ : పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో భాగ్యరేఖ ఆధ్వర్యంలో మంగళవారం ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సభ్యులు, పెడపల్లి శ్రీనివాసులు నాయక్, పవిత్ర, గోరంట్ల, పై పల్లి గంగాధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ శ్మశానవాటికలకు స్థలాలు, స్థలాలకు హద్దులు చూపించాలని సభ్యులు కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : చిలకం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

కాలనీవాసులతో మాట్లాడుతున్న 'చిలకం'

వార్డు ప్రజల సమస్యలు పరిష్కరించడమే తమ ధ్యేయమని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం పట్టణంలోని కేతిరెడ్డి కాలనీలో 'సేవ్ ధర్మవరం' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి వార్డులో పర్యటించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సుగుణమ్మ, మహేష్, కుళాయప్ప, జనసేన పార్టీ నాయకులు మత్స్యకార వికాస విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెస్త శ్రీనివాసులు, కన్వీనర్ నాగ సుధాకర్ రెడ్డి, కమిటీ సభ్యులు రాజు, ప్రకాష్, చిలకల సుధాకర్, కోటికి రామాంజి, గంగాధర్, చిలకం సుధాకర్ రెడ్డి, సాకే నరసింహులు, శ్రీరామ్ రెడ్డి, బిల్లే నందా తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు ఎమ్మెల్యే సీటు కేటాయించాలి

గోరంట్ల : సార్వత్రిక ఎన్నికల్లో గిరిజనులకు రాజకీయంగా ప్రాధాన్యత కల్పిస్తూ ఎమ్మెల్యే సీటు కేటాయించాలని గోరంట్ల జెడ్పీటీసీ జయరాం నాయక్ కోరారు. ఈ మేరకు ఆయన తిరుపతిలో రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసి రాయలసీమ జిల్లాల్లో ఏదైనా ఒక నియోజకవర్గంలో గిరిజనులకు ఎమ్మెల్యే సీటు కేటాయించాలని కోరారు. గిరిజనులకు ఎమ్మెల్యే టికెట్ కేటాయిస్తే ఆ అవకాశం తనకు కల్పించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆశాల ధర్నా

ఓబుల దేవర చెరువు : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశ వర్కర్లు మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్ల సంఘం నాయకురాలు బషీరా, తార, రాధ మాట్లాడుతూ ఆశాలకు కనీస వేతనం ఇవ్వాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ గా మార్పు చేయాలని, పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్ల తో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్ జాకీర్‌కు అందజేశారు.

టిడిపి సాధికార సమితి సభ్యులుగా శ్రీరాములు

కదిరి అర్బన్ : శ్రీ సత్యసాయి జిల్లా హిందూపూర్ పార్లమెంట్ నాయీ బ్రాహ్మణ సాధికార సమితి మెంబర్‌గా శ్రీరాములును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం కదిరి టీడీపీ ఇన్‌ఛార్జి వెంకటప్రసాద్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమణ, నాగప్ప, ఈశ్వరయ్య, కిష్టా, శివ తదతరులు పాల్గొన్నారు.

సత్యసాయి గిరి ప్రదక్షణ

పుట్టపర్తి క్రైమ్ : పుట్టపర్తిలో ప్రతి పౌర్ణమిని పురస్కరించుకొని నిర్వహించే సత్య సాయి శ్రీ గిరి ప్రదక్షణ మంగళవారం ఘనంగా జరిగింది. సత్యసాయి బాబా చిత్రపటాన్ని ప్రత్యేక రథంపై ఉంచి ఊరేగిస్తారు. ప్రశాంతి నిలయంలోని గణేష్ గేట్ వద్ద సాయంత్రం 6:30 గంటలకు ప్రారంభమైన ఈ గిరిప్రదక్షిణ గోకులం, గణేష్ కూడలి, బైపాస్, పెట్రోల్ బంకు, చింతతోపు, పెద్ద బజార్ మీదుగా సుమారు ఏడు కిలోమీటర్ల పాటు కొనసాగింది. అనంతరం తిరిగి గణేష్ వద్ద మహా మంగళహారతితో ఈ కార్యక్రమం ముగిసింది.

రిజ్వాన్ బాషాకు ఉత్తమ సేవా పురస్కారం

ధర్మవరం టౌన్ : గత 26 సంవత్సరాల నుండి గణిత విద్యా బోధన చేస్తూ వందలాదిమంది విద్యార్థులను అత్యున్నత శిఖరాలకు చేర్చి గణిత శాస్త్ర బోధకుడిగా సేవలు అందించిన విశ్వభారతి హై స్కూల్ చైర్మన్ రిజ్వాన్‌బాషా పెనుకొండ దర్గా పీఠాధిపతి చేతుల మీదుగా ఉత్తమ సాంఘిక సేవ పురస్కార ప్రశంసా పత్రం, మెమొంటోను అందుకున్నారు. దీంతో పాఠశాల ఉపాధ్యాయులు, బోధ నేతర సిబ్బంది, స్నేహితులు కలిసి రిజ్వాన్‌బాషాకు అభినందనలు తెలిపారు.

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి

బుక్కపట్నం : తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని సత్య సాయి జిల్లా టిడిపి కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మాజీ సర్పంచి సాకే యశోద రాయుడు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి టిడిపి రూపొందించిన మినీ మేనిఫెస్టో గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా అధ్యక్షురాలు లావణ్య గౌడ్, సయ్యద్ బాషా, మాజీ ఎంపీపీ బాలు, ఈశ్వరయ్య, మంజునాథ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల నిరసన 'మోత'

తలుపులలో ప్లేట్లను శబ్దం చేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి - చిలమత్తూరు

అంగన్వాడీలు చేస్తున్న నిరసనకు సిపిఎం చివరి వరకు అండగా ఉంటుందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ అన్నారు. ఈ మేరకు చిలమత్తూరులో 15 రోజులుగా అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు మంగళవారం మద్దతు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీల ఆందోళనకు విశేష మద్దతు లభిస్తుందని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కార్మిక వర్గం రోడ్లు పైకి వచ్చి ఆందోళన చేస్తే తప్ప వారి సమస్యలు పరిష్కారం అయ్యే పరిస్థితులు కనపడటం లేదని అన్నారు. 15 వ రోజు ఆందోళనలో బాగంగా ప్లేట్లు కొట్టి నిరసన తెలిపారు. వీరికి యుటిఎఫ్ నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమం లో అంగన్వాడీ సంఘం నాయకులు శోభమ్మ, రామతులసమ్మ తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : తమ సమస్యల పరిష్కారం కోసం గత 15 రోజులుగా అంగన్వాడి కార్యకర్తలు చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. శబ్దాలు చేస్తూ ఆ శబ్దాలు జగన్మోహన్ రెడ్డికి వినిపించాలని నినాదాలు చేస్తూ పురవీధుల గుండా ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీదేవి, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని15వ రోజు నిరవధిక సమ్మె భాగంగా పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం వినూత్నంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ప్లేట్లు కొడుతూ నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు బావమ్మ, జయమ్మ, సెక్టార్ లీడర్లు వరలక్ష్మి, శాను, అనిత,లక్ష్మీదేవి, అనూష, శ్యామల గౌరీ తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయం ముందు 15 రోజులుగా సమ్మె చేపడుతున్న అంగన్వాడీలకు మైనార్టీ యువ నాయకుడు సామాజిక సేవాకర్త ఉమర్‌ఖాన్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీల సమ్మెకు మాజీ ఎమ్మెల్యే పార్థసారథి సతీమణి కమలమ్మ హాజరై మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్లమెంట్ కార్యదర్శి నరసింహులు, జిల్లా సహాయ కార్యదర్శి వేణు, మైనార్టీ నాయకుడు అజ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు

సోమందేపల్లి : మండల కేంద్రంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీదేవి ఆధ్వర్యంలో స్థానిక సాయిబాబా గుడి ఆవరణములో మంగళవారం అంగన్వాడీలు వినూత్న నిరసన తెలిపారు. తమ కుటుంబ సభ్యులతో కలిసి ప్లేట్లతో శబ్దం చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ మండల కార్యదర్శి శోభారాణి తదితర అంగన్వాడీలు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండలం వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న అంగన్వాడీలు తట్టలతో డప్పు కొట్టు నిరసన చేశారు. అంగన్వాడీల సమ్మెకు సిపిఎం సిఐటియు నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, నాయకులు బాబు, వెంకటేష్, పోతలయ్య, లక్ష్మీనారాయణ, రహంతుల్లా, చాంద్ బాషా, అంగన్వాడి ప్రాజెక్టు అధ్యక్షురాలు రజియా, ,అంగన్వాడీలు పాల్గొన్నారు

గాండ్లపెంట : మండల కేంద్రంలో 15వ రోజు అంగన్వాడీలు ప్లేట్ల శబ్దాలతో సమ్మె నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగనవాడీ యూనియన్ మండల అధ్యక్షులు లక్ష్మీదేవి, భారతి, సుజాత, అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : మండలంలో 15వ రోజు అంగన్వాడీలు ప్లేట్లతో నిరసన తెలిపారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని ఆశా కార్యకర్తలు తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల : అంగన్వాడీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ డిమాండ్ చేశారు. అంగన్వాడీ కార్యకర్తలు 15 రోజులుగా వివిధ రూపాలలో సమ్మె చేస్తున్న పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు. అంగన్వాడీలకు మద్దతుగా ఆశా వర్కర్లు సంఘీభావం తెలుపుతూ సమ్మెలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్: 15 రోజుల నుంచి సమ్మె చేస్తున్న అంగన్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించకపోవడం సిగ్గుచేటని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమ్మెలో భాగంగా మంగళవారం 15వ రోజు జరిగిన నిరసన కార్యక్రమాన్నిపుట్టపర్తి గణేష్ కూడలిలో నిర్వహించారు. సుమారు రెండున్నర గంటల పాటు రోడ్డును దిగ్బంధం చేసి ప్లేట్లు గెరిటెలతో పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. మానవహారం నిర్వహించారు..ప్రభుత్వం ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో జనవరి 3న కలెక్టర్ కార్యాలయాన్ని దిగ్బంధం చేస్తామని అప్పటికి స్పందించకపోతే సీఎం క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఎస్ టి యు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చంద్రశేఖర్ జిల్లా అధ్యక్షులు రామ్మోహన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు కోశాధికారి ఆదినారాయణ జిల్లా రాష్ట్ర నాయకులు తమ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బ్యాళ్ల అంజి, గంగాధర్, ప్రాజెక్టు అధ్యక్షులు సుజాత,, కార్యదర్శి నాగమణి కోశాధికారి మంజుల, అన్ని సెక్టార్ల నాయకులు వర్కర్స్, హెల్పర్స్, మినీలు తదితరులు పాల్గొన్నారు.

తలుపుల : అంగన్వాడీలు 15 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవటం దుర్మార్గమని అంగన్వాడీ యూనియన్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు అంగన్వాడీలు స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట ప్లేటు, గెరిటలు మోగిస్తూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఆందోళనలో సొమ్మసిల్లిన అంగన్వాడీ హెల్పర్

ప్రజాశక్తి-హిందూపురం

మొత్తుకపల్లి సెంటర్‌కు చెందిన హెల్పర్ సరస్వతి ఆందోళన కార్యక్రమంలో పాల్గొని సమ్మె శిబిరం వద్ద మంగళవారం సొమ్మసిల్లి పడిపోయింది. వెంటనే తోటి కార్యకర్తలు పక్కన ఉన్న జిల్లా ప్రభుత్వ అసుపత్రి తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి వైద్య సేవలను అందించారు.

ప్రభుత్వ అసుపత్రిలో చికిత్స పొందుతున్న సరస్వతి

బత్తలపల్లి : మండలంలో అంగన్వాడీలు మంగళవారం వినూత్న నిరసన చేపట్టారు. ప్లేట్లను శబ్దం చేస్తూ సమ్మెలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు వాసంతి, రజిత, కృష్ణవేణి, సున్నిబేగం, జయసుధ అరుణా , భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ : అంగన్వాడీల నిరవధిక సమ్మె మంగళవారం నాటికి 15వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్వాడీలు స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి జిబి శివకుమార్ కు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్నిసమర్పించారు. ఈ కార్యక్రమంలో గుడిబండ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యదర్శి మహాదేవమ్మ, నాయకులు లక్ష్మీదేవి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

ఓబుళదేవర చెరువు : తమ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ మంగళవారం అంగన్వాడీలు ప్లేట్లను గెరిటలతో కొడుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీదేవి, కదిరి నరసింహులు, సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, కుళ్లాయప్ప, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : తమ సమస్యలు పరిష్కరించేంతవరకు సమ్మె ఆగదని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ మండల ప్రధానకార్యదర్శి చంద్రకళ హెచ్చరించారు. అంగన్వాడీల సమ్మెలో భాగంగా తహశీల్దార్ కార్యాలయం ఎదుట 15వ రోజు మంగళవారం అంగన్వాడీలు పేట్లను గ్లాసులతో శబ్దం చేస్తూ వినూత్న నిరసన చేశారు. ఈ కార్యక్రమంలో సిఐఐయు మండల అధ్యక్షులు ఆదినారాయణ, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జం గాలపల్లి పెద్దన్న, సిపిఎం పట్టణ కార్యదర్శి నాగార్జున, సిఐటియు నాయకులు బాలాజీ, షేక్షావలి, అంగన్ వాడీలు పోతక్క, దీనా, మాంచాలిని దేవి, అనిత, క్రిష్ణవేణి, భువనేశ్వరి, లలిత పాల్గొన్నారు.

హిందూపురం : తమ డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె మంగళవారం నాటికి 15వ రోజుకు చేరింది.మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు పట్టణంలో గరిటితో కంచాలను మోగిస్తు వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. సర్కిల్‌లో ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో సమ్మె చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు సాంబశివ, అంగన్ వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రెజెక్టు కార్యదర్శి లావణ్య, సిఐటియు నాయకులు రాజప్ప, అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకులు శిరీష, సెక్టర్ లీడర్లు శైలజ, నాగమ్మ, వరలక్ష్మి, విజయలక్ష్మి, భారతి, పద్మ, గీత, వాణి పెద్ద ఎత్తున అంగన్వాడీలు పాల్గొన్నారు.

ఆశాల మద్దతు : అంగన్వాడీలకు మద్దతుగా ఆశ వర్కర్లు పట్టణంలో ర్యాలీ నిర్వహించి, డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు త్రివేణి, సౌభాగ్య తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తిలో అంగన్వాడీల మానవహారం

హిందూపురంలో అంగన్వాడీల ర్యాలీ

గుడిబండలో అంగన్వాడీల నిరసన

సోమందేపల్లిలో అంగన్వాడీల నిరసన

ఆలయ నిర్మాణానికి విరాళం

తనకల్లు : మండల పరిధిలోని మండ్లిపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి బెంగుళూరుకు చెందిన రియల్టర్, పాళ్యం సుధాకర్ విరాళం అందజేశారు. ఈ మేరకు ఆయన ఆలయ నిర్మాణ నిర్వాహకులకు మంగళవారం రూ. 25వేలు అందజేశారు. ఈసందర్భంగా గ్రామస్తులు ఆయనను సన్మానించారు. అదేవిధంగా సిఆర్. పల్లిలో ఆలయ నిర్మాణానికి 20వేల రూపాయలు, తనకల్లు మండల కేంద్రంలో నిర్మిస్తున్న అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి పదివేల రూపాయలు అందించారు.ఈ కార్యక్రమంలో నాయకులు బొడ్డు గొల్ల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం

మడకశిర : మండల పరిధిలోని జిల్లేడుగుంట ఆంజనేయస్వామి, భక్తరపల్లి నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవం వైభవంగా జరిగింది. ఈనెల 23 నుండి ప్రారంభమైన బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన రథోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ సురేష్ బాబు, ఎస్ఐ లోకేష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.ఈ బ్రహ్మోత్సవాల కార్యక్రమంలోటిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి , రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ , డాక్టర్ సెల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, పార్టీ సీనియర్ నాయకులు సుబ్బారెడ్డి, వడ్డే రఘురాం, బుడ్డయ్యపాలెం ప్రసాద్, రవీంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

In The Court of The Senior Civil Judge, Penukonda
O.S. No.199/2014

Between :
Sathyala Narasimha Reddy and others **...Plaintiffs**
And
Sathyala Nagalakshmamma and others **...Defendants**

పై నెంబరు దావాలోని 9,10,11 ప్రతివాదులకు దావా సమన్లు

To:
D.9:Sathyala Nagalakshmamma W/o Late Venkata Reddy, Mallapalli Kothapalli, Gorantla Mandal.
D.10:Sathyala Vasudeva Reddy W/o Late Venkata Reddy, Mallapalli Kothapalli, Gorantla Mandal.
D.11:Radhamma W/o Sreenivasa Reddy, Mallapalli Kothapalli, Gorantla Mandal.

ఇందుమూలముగా మీకు తెలియజేయడము ఏమనగా పై నెంబరు దావాలోని వాదులు దావా షెడ్యూలు దాఖలా ఆస్థిని డిక్లరేషన్‌కు మరియు పర్మనెంట్ యింజక్షన్‌కు గాను దావా దాఖలు చేసినారు. సదరి విషయముల్లై మీకు ఏమైనా ఆక్షేపనలు వున్న యెడల మీరు పై కోర్టులో 28/12/2023వ తేదిన ఉదయం 10:30 గంలకు ఖుద్దున గాని వకీలు ద్వారా గానీ హాజరై మీ వాదనలు కోర్టు వారికి తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు పై దావాను తీర్మానము చేయుదురని యిందుమూలకముగా మీకు తెలియజేయడమైనది.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

ఆర్.శ్రీకాంత్ రెడ్డి, ,
వాదులపరం వకీలు, పెనుకొండ

హామీలను అమలు చేయాల్సిందే..

పుట్టపర్తిలో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు, నాయకులు

కదిరిలో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు, నాయకులు

సిఐటియు, మున్సిపల్ కార్మికుల డిమాండ్ జిల్లా వ్యాప్తంగా సమ్మె ప్రారంభం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

మున్సిపల్ కార్మికులకు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిందేనని సిఐటియు, మున్సిపల్ కార్మిక సంఘం నేతలు డిమాండ్ చేశారు. న్యాయమైన సమస్యల పరిష్కారం, ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె మంగళవారం ప్రారంభం అయ్యింది. పుట్టపర్తిలో మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు విధులను బహిష్కరించి సమ్మెలోకి వెళ్లారు. పుట్టపర్తి నగర పంచాయతీ కార్యాలయం వద్ద బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా మున్సిపల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో మున్సిపల్ కార్మికులకు అనేక వాగ్దానాలు చేశారన్నారు. వాటిలో ఏ ఒక్కటి కూడా అమలుకు నోచుకోలేదన్నారు. కనీస వేతనం, ఉద్యోగ భద్రత, సిపిఎస్ రద్దు తదితర హామీలు ఇచ్చారన్నారు. ముఖ్యమంత్రిగా ఆయన పదవీకాలం ఐదేళ్లు పూర్తి కావస్తున్నా ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి స్పందించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కార్మికులందరినీ పర్మనెంట్ చేసి, ఇంక్రిమెంట్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రావిటీ ఇవ్వాలన్నారు. కార్మికులకు అవసరమైన పనిముట్లు అందజేయాలన్నారు. అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలనూ మున్సిపల్ కార్మికులకు వర్తింపచేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు నిరవధికంగా సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్మికుల సమ్మెకు టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ సంఘీభావం తెలిపారు. కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రవాణా రంగం జిల్లా కార్యదర్శి బాబావలి, పట్టణ సిఐటియు కార్యదర్శి పైపల్లి గంగాధర్, మున్సిపల్ కార్మికుల యూనియన్ నాయకులు పెద్దన్న, రామయ్య, నరసింహులు, నాగార్జున ఇంజినీరింగ్ విభాగం నాయకులు గణేష్, రమేష్, రామదాసు, డ్రైయినేజీ కార్మిక సంఘం నాయకులు నాగరాజు, వెంకటేష్, పోతులయ్య, పెద్దన్న పాల్గొన్నారు.

మడకశిర : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు మున్సిపల్ కార్మికులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలు తీర్చాలని అధికారులకు ప్రభుత్వానికి ఎన్నిసార్లు తెలియజేసిన పట్టించుకోకపోవడంతో విధిలేని పరిస్థితిలో ధర్నా చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సమస్యలను వెంటనే తీర్చాలని వారు డిమాండ్ చేశారు.

ధర్మవరం టౌన్ : మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని మున్సిపల్ పారిశుధ్య కార్మికసంఘం అధ్యక్షులు బాబు, ఇంజనీరింగ్ కార్మికసంఘం అధ్యక్షులు మహేష్ లు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు సమ్మె చేపట్టారు.వీరి సమ్మెకు సిఐటియు మండల ఉపాధ్యక్షులు బాలాజీ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికసంఘం గౌరవసలహాదారులు పెద్దక్క, వెంకటేశులు, సెక్రటరీ చెన్నకేశవులు, కోశాధికారి లక్ష్మీఓబుళేశు, ఉపాధ్యక్షులు ప్రసాద్, జాయింట్ సెక్రటరీ ముకుందా తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బుధవారం నిరవధిక సమ్మె చేపట్టారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బాలకృష్ణ ,జనార్ధన్ ఆధ్వర్యంలో మున్సిపల్ ఆఫీస్ ఎదుట సమ్మె చేపట్టారు. వీరికి కాంగ్రెస్ పార్టీ, బహుజన సమాజ్ పార్టీ నాయకులు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ యూనియన్ నాయకులు తిరుపాల్, సూరి, చెన్నకృష్ణ, చంద్రప్ప, రాజు, నరసింహమూర్తి, సిఐటియు నాయకులు జిఎల్. నరసింహులు, జగన్మోహన్, బాబ్జాన్, జిలాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు షానవాజ్, కదిరప్ప, మునికుమార్, నాయకులు బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాబయ్య స్వామి గంధం వేడుకలు

ప్రజాశక్తి -పెనుకొండ

పట్టణంలోని దర్గా పేటలోని బాబయ్య స్వామి దర్గా 751 వ గంధం వేడుకలను మంగళవారం తెల్లవారుజామున ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక సందల్ మహల్ వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పకీర్ల విన్యాసాలు,డప్పులు కొడుతూ గంధంను బాబయ్య స్వామి దర్గా వరకు తీసుకెళ్లారు.ఈ సందర్భంగా గంధాన్ని బాబయ్య స్వామికి సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు, ప్రజలు పాల్గొన్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా డి ఎస్ పి హుస్సేన్ పీరా ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

టీడీపీ ఆధ్వర్యంలో అన్నదానం : బాబయ్య స్వామి దర్గా ఉరుసు సందర్భంగా మంగళవారం మధ్యాహ్నం భక్తులకు టీడీపీ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు పార్థసారథి సతీమణి కమలమ్మ, ఆమె కుమారుడు సాయి కళ్యాణ్,అల్లుడు శశిభూషణ్, మాజీ గ్రంధాలయ సంస్థ చైర్మన్ గౌస్ మోదీన్, జిల్లా మైనార్టీ ప్రధాన కార్యదర్శి నాగూర్ హుస్సేన్, టీడీపీ నాయకులు కేశవయ్య, సిద్దయ్య, సిద్ధలింగప్ప, శ్రీనివాసులు, గిరి, గాయత్రి, మైనార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే స్థానిక హెచ్‌పి పెట్రోల్ బంకు వద్ద టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేశారు. అదేవిధంగా పట్టణంలో ట్యాంకర్ ద్వారా తాగునీటినిసరఫరా చేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వెంకటేశ్వరరావు, గుట్టూరు సూర్యనారాయణ, శ్రీరాములు,బాబుల్ రెడ్డి,డీవీ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

యువకుడు ఆత్మహత్య

పుట్టపర్తి రూరల్: మండల పరిధిలోని పెడపల్లి గ్రామానికి చెందిన యువకుడు మంగళవారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన నాగేంద్రమ్మ ,పద్మావతి కుమారుడు సంతోష్ 10వ తరగతి చదువుకొని కార్పెంటర్ పనిచేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇటీవల సంతోష్‌కు మూత్రపిండాల వ్యాధి సోకడంతో పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చికిత్స తీసుకొని అనంతరం కార్పెంటర్ పనిచేసుకుని జీవిస్తున్నాడు. ఇటీవల సంతోష్ తల్లి పద్మావతికి ఆరోగ్యం క్షీణించడంతో అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ సమస్యలకు తోడు ఆర్థిక ఇబ్బందులు తనను వెంటాడడంతో మనస్థాపం చెందిన సంతోష్(22) ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కొత్తచెరువు : మండల పరిధిలోని లోచర్ల సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో.బైరాపురం బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ రామచంద్రారెడ్డికి తీవ్ర గాయాలు అయ్యాయి. రామచంద్రారెడ్డి ద్విచక్ర వాహనంలో కొత్తచెరువు నుండి తన స్వగ్రామం బైరాపురానికి బయలుదేరాడు. రొల్ల ఎంపీడీవో ఆజాద్ విధులు ముగించుకొని కారులో వస్తూ రామచంద్రారెడ్డి ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో రామచంద్రారెడ్డికి రెండు కాళ్లు విరగడంతో పాటు తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే సంఘటనాస్థలంలోనే కారును వదిలి వెళ్లిపోయారని గ్రామస్తులు తెలిపారు. క్షతగాత్రుడిని 108 సాయంతో పుట్టపర్తి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం బెంగళూరు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

యువకుడు అదృశ్యం

ముదిగుబ్బ : మండలంలోని గుడ్డంపల్లి తండాకు చెందిన మూగ చవిటి బుద్ధి మాంద్యత గల యువకుడు శివ నాయక్ కొన్ని రోజులుగా కనిపించడం లేదని బంధువులు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇల్లు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదని యువకుడి తల్లి తిరుపాల్ బాయ్ వాపోయారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వంశీకృష్ణ తెలిపారు.

జాతీయ రహదారిపై బైక్ రేసర్ల హల్‌చల్

పెనుకొండ : పట్టణ సమీపంలోని ఆర్టీవో చెక్ పోస్ట్ వద్ద జాతీయ రహదారిపై బైక్ రేసర్లు రెచ్చి పోయారు. బాబయ్య స్వామి ఉరుసు పేరిట వచ్చే కొంతమంది యువకులు రోడ్డు పై భయంకరమైన విన్యాసాలు చేస్తూ వాహనదారులను ఉలిక్కి పడేలా చేశారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు రోడ్డు పై హంగామా చేశారు. సైలెన్సర్ల శబ్దాలతో పట్టణంలోకి కూడా ప్రవేశించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారు. రోడ్లపైనే ట్రాఫిక్ ఆపేసి కేక్ లు కూడా కట్ చేశారు. దాదాపు 100 మంది దాకా బైక్ రేసర్లు ఈ హంగమా సృష్టించారు.

ఎస్సీ నాయకులపై దూషణలు తగదు

మడకశిర : అనంతపురం జిల్లా ఎస్సీ సెల్ జనరల్ సెక్రెటరీ మల్లికార్జునను తాడిపత్రి నియోజకవర్గ ఎమ్మెల్యే పెద్దారెడ్డి అనుచరుడు దూషించడం తగదని వ్యక్తిగత విమర్శలు చేయడాన్ని ఖండిస్తున్నామని సత్యసాయి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్ అన్నారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళిత నాయకుడు మల్లికార్జున మురుగునీళ్లలో కూర్చున్నాడని వ్యంగ్యంగా విమర్శించడం తగదన్నారు. ఎమ్మెల్యే పెద్దారెడ్డికి దళితుల పైన ఎంతటి అంకితభావం ఉందో దీన్ని బట్టి అర్థమవుతోందన్నారు. రాబోయే ఎన్నికల్లో దళితులంతా ఏకమై దళిత వ్యతిరేక ప్రభుత్వాన్ని ఓడించడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు.

ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమ్మెకు మద్దతు

ప్రజాశక్తి - మడకశిర

పుట్టపర్తి కేంద్రంలో సమగ్ర శిక్షణ ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు మద్దతు ఇస్తున్నట్లు ఎస్టీయు జిల్లా నాయకులు టి ఆదినారాయణ తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

చిలమత్తూరు : ఎస్ఎస్ఎ ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ ల సాధనకు చేస్తున్న నిరవధిక సమ్మెకు చిలమత్తూరు మండల ఉపాధ్యాయ జేఏసి సంఘం విరాళం అందజేసింది. ఈ మేరకు ఆసంఘం నాయకులు పుట్టపర్తి వెళ్లి ఎస్ఎస్ఎ ఉద్యోగులకు రూ.40వేలను అందజేశారు. ఈకార్యక్రమంలో అలీముల్లా, గోపాలరెడ్డి, శ్రీనివాసులు, రవికుమార్,ఉపాధ్యాయులు, ఎస్ఎస్ఎ ఉద్యోగులు పాల్గొన్నారు.

యువతలో ప్రతిభను వెలికి తీయడానికే 'ఆడుదాం ఆంధ్ర'

పుట్టపర్తిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

యువతలో ప్రతిభ వెలికి తీయడానికే ఆడుదాం ఆంధ్ర అనే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని శాసనసభ్యులు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి ఉన్నత పాఠశాలలో జరిగిన క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం యువత ఎక్కువగా సెల్ ఫోన్ లకు, టీవీలకు పరిమితం అవుతున్నారని వారిలో ఉన్న ప్రతిభను గుర్తించడం లేదని అన్నారు. దీంతో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి యువత కోసమే ఈ ఆటల పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం క్రీడాకారులకు క్రీడా సామాగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భాగ్యరేఖ, మున్సిపల్ కమిషనర్ రాంభూపాల్ రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, తహశీల్దార్ నవీన్ కుమార్, మున్సిపల్ ఛైర్మన్ తుంగ ఓబుళపతి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ తిప్పన్న, పుడా ఛైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, కౌన్సిలర్లు చెరువు భాస్కర్ రెడ్డి, సూర్య గౌడ్, వైసిపి రాష్ట్ర మహిళా కార్యదర్శి సాయి లీల, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలను ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి , శ్రీ సత్య సాయి జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అంతర్జాతీయ స్థాయి హాకీ క్రీడాకారిణి రజినీ, అంతర్జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ క్రీడాకారుడు శ్రీకాంత్ రెడి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం గ్రామీణ స్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు అంచెలంచలుగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వంశీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు, తహశీల్దార్ సునీత, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సుస్మిత, మునిసిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు, కౌన్సిలర్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : నియోజకవర్గ పరిధిలోని రొల్ల మండలం రత్నగిరిలో మంగళవారం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మండల విద్యాధికారి శ్రీధర్ మాట్లాడుతూ ఋ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి చినరంగప్ప, కార్యదర్శి రచన, వ్యాయామ ఉపాధ్యాయుడు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండలంలోని సంకేపల్లి సచివాలయం పరిధిలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ఎంపీపీ గొడ్డుమర్రి ఆదినారాయణ యాదవ్ ప్రారంభించారు ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణరెడ్డి, సర్పంచి ప్రసన్నలక్ష్మి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు

గాండ్లపెంట : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను ఎంపీడీవో కే రామ నాయక్ ఎంపీపీ జగన్మోహన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు కృష్ణానాయక్, శ్రీనివాసులు, ఇఒఆర్‌డి సునీత, సర్పంచులు సధాకర్, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారుజ

కొత్తచెరువు : క్రీడా పోటీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ గాయత్రి, జెడ్పీటీసీ గంగాదేవి, ఎంపీడీవో బారాన్ సాహెబ్ ,తెలిపారు కొత్త చెరువులోనే జూనియర్ కళాశాల మైదానంలో క్రీడా పోటీలను వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు నాగరాజు, శ్యాంసుందర్ రెడ్డి ,సోమశేఖర్ రెడ్డి, మటన్ శంకర్, కమ్మన్న, కృష్ణమూర్తి, పెయింటర్ కేశవ, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలను జెడ్పీటీసీ స్వారక్క నరసింహమూర్తి, సర్పంచి వాగేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

తలుపుల : స్థానిక కదిరి రోడ్డు సమీపంలోని డిప్పుల మైదానంలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పివి. సిద్ధారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మహమ్మద్ రఫీ నాయక్, వైసిపి నాయకులు డీకే బాబు, ఫయాజ్, బి. సూర్యనారాయణ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, టోపీ రమణ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రకార్యక్రమాన్ని మంగళవారం పట్టణంలోని బిఎస్సార్ మున్సిపల్ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో మంగళవారం ప్రారంభించారు. రేగాటిపల్లి రోడ్డు జీవానంద ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో మహిళల ఖోఖో పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ కాచర్ల లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి,కౌన్సిలర్ భాగ్యలక్ష్మి, శారద, జిలాన్ భాష పెనుజూరు నాగరాజు, పిఇటిలు లక్ష్మీనారాయణ లక్ష్మీపతి, హెచ్‌ఎం రాంప్రసాద్, ఎంఇఒ గోపాల్ నాయక్, జీవానంద కరస్పాండెంట్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలను ఎంపిపి రమణారెడ్డి, ఎంపిడిఒ శకుంతల ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ : మండల వ్యాప్తంగా ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలను ప్రారంభించారు. రాళ్లపల్లి పాఠశాలలో సర్పంచి లక్ష్మీనారాయణ పంచాయతీ కార్యదర్శి గోవిందప్ప విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు.

రొద్దం : మండల వ్యాప్తంగా వివిధ సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలను మంగళవారం ప్రారంభించారు.

హిందూపురం : పట్టణంలోని ఎంపిఎం మైదానంలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వివిధ పాఠశాల విద్యార్థులచే 5కె మారథాన్ ర్యాలీని ఇన్‌చార్జ్ దీపిక ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఎ, బి బ్లాక్ కన్వీనర్లు సాదిక్, నరేష్, మండల కన్వీనర్ రాము, పలువురు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, వివిధ పాఠశాలల పీడీలు, మున్సిపల్ అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

హిందూపురంలో బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న దీపిక

కదిరిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

ధర్మవరంలో పోటీలను ప్రారంభిస్తున్న కమిషనర్,ఛైర్‌పర్సన్

పురానికి గుర్తింపు తీసుకురావడం అభినందనీయం

ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో షబ్బీర్‌కు సన్మానిస్తున్న పాత్రికేయులు

ప్రజాశక్తి-హిందూపురం

నిత్యం ఒత్తిళ్ళను జయిస్తూ... తమ రచనలతో సమాజాన్ని మేల్కొలిపి, పాత్రికేయ వృత్తిలో రాణించి దేశ, రాష్ట్రీయ స్థాయిలో పురం పాత్రికేయులు హిందూపురం పట్టణానికి గుర్తింపు తీసుకురావడం అభినందనీయమని సీనియర్ పాత్రికేయులు రాంప్రసాద్ అన్నారు. హిందూపురం పట్టణానికి చెందిన నేత్ర ఓ చానల్‌లో పని చేస్తోంది. ఈమెకు ఇటీవల జాతీయ స్థాయి ఆవార్డు లభించింది. అదే విధంగా ప్రజాశక్తిలో విధులు నిర్వహిస్తున్న షబ్బీర్‌కు రెండు సార్లు రాష్ట్ర స్థాయిలో అందించే బొమ్మరెడ్డి అవార్డుతో పాటు, సోమవారం రాత్రి పెనుకొండలో నిర్వహించిన జాతీయ స్థాయి సర్వమత సమ్మేళలో జాతీయ పురస్కారం అందజేశారు. వీరితో పాటు సీనియర్ పాత్రికేయులు నాగరాజుకు ఇటీవల తన కళ నైపూణ్యాన్ని గుర్తించి ఎన్టీఆర్ అవార్డును అందించారు. వీరిని హిందూపురం ప్రెస్‌క్లబ్‌లో ఆధ్వర్యంలో మంగళవారం అధ్యక్షులు సురేష్‌రెడ్డి అధ్యక్షతన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు రాంప్రసాద్, సుధాకర్, తదితరులు మాట్లాడుతు పాత్రికేయులు తమ వృత్తిలో గుర్తింపు పొందాలంటే ఎంతో కృషి చేయాలన్నారు. అనంతరం అవార్డు గ్రహీతలను పాత్రికేయులతో పాటు ప్రజా సంఘాల నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు చంద్రశేఖర్‌రెడ్డి, నరసింహ, రామాంజి, సిద్దు, ప్రశాంత్, కిష్టప్ప, అంజినమూర్తి, శివ, జబివుల్లా, చరణ్, ప్రదీప్, దాసప్ప, గిరి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సర్వమత సమ్మేళనం

ప్రజాశక్తి -పెనుకొండ

పట్టణంలో బాబయ్య స్వామి దర్గా గంధం సందర్భంగా వంశపారంపర్య దర్గా పీఠాధిపతి తాజ్ బాబా ఆధ్వర్యంలో సర్వమత సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ సమైక్యతా పురస్కారాల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గజల్ శ్రీనివాసులు హాజరయ్యారు. తన గజల్స్ ద్వారా మానవులంతా ఒక్కటే నని చెప్పారు. ఇంతటి గొప్పకార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న పీఠాధిపతి తాజ్ బాబ ఆదర్శనీయుడని అన్నారు. అనంత సాహిత్య అకాడమీ, యునైటెడ్ టిప్పు సుల్తానా ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గజల్ శ్రీనివాసులుకు తాజ్ బాబా చేతులమీదుగా జాతీయ సమైక్యతా జీవన సాఫల్య పురస్కారం అందజేశారు.అదేవిధంగా డిఎస్పీ హుస్సేన్ పీరా, ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్, తహశీల్దార్ టి.శ్రీనివాసులు,ఉత్తమ సామాజిక కార్యకర్త ఎసి.నాగరాజు, విద్యాప్రదాత జెఇ. వెంకట స్వామి,ఉత్తమ ఐక్య సిక్కు మొహిందర్ జీత్ సింగ్, బ్రహ్మకుమారి డాక్టర్ హేమలత ,మీనాక్షి ఫౌండేషన్ ఛైర్మన్ రవికాంత్ రమణ, ఉత్తమ మీడియా రిపోర్టర్ షబ్బీర్, హిందూపురం అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, ఇందాద్ తదితరులకు జాతీయ సమైక్యతా పురస్కారాలను అనంత సాహిత్య అకాడమీ అధ్యక్షులు జాబిలి చాంద్‌బాషా, ఆలిండియా టిప్పూ సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షులు ఉమర్ ఫారూక్ ఖాన్ సంయుక్త ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో రవిశంకర్ గురూజీ, మాజీ సర్పంచి శ్రీనివాసులు తెలుగు,ఉర్దూ కవులు, తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న దృశ్యం